క్లుప్తంగా

మహిళలకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాల నుంచి ఆరోగ్య మహిళా కార్యక్రమం మంగళవారం డాక్టర్ సింధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు వచ్చే వివిధ అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. రక్తహీనత, దీర్ఘకాలిక వ్యాధులు, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎస్ఎమ్ రేవతి, ఫార్మసిస్ట్ తిరుమల్‌రావు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని కర్రెమ్మ తల్లి నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించి ప్రత్యేక పూజలు చేశారు. గంగానయనం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచకము, యాగశాల ప్రవేశం అభిషేకం తదితర క్రతువులు నిర్వహించారు. 26న ఆలయ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

యువత రక్తదానం చేయాలి

శాంతినగర్ : యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నరసింహ ఓ ప్రకటనలో కోరారు. భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని అయిజ పాత బీజేపీ కార్యాలయం, పాత బస్టాండ్ సమీపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



గట్టు : అకాల మరణం చెందిన మిత్రుడి కుటుంబాన్ని పదో తరగతి మిత్రులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. మాచర్ల ఉన్నత పాఠశాలలో 2006 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన కృష్ణాజీ ఈ నెల 13న మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కృష్ణాజీ కుటుంబ సభ్యులను అతని మిత్రులు మంగళవారం పరామర్శించారు. అనంతరం రూ. 32 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో శంకర్, పోలన్న, లక్ష్మణ్, జంబన్న, రవిచంద్ర, సుదర్శన్, రమేష్, విశ్వనాథ్, నర్సప్ప, సురేష్, ఈరన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ విడుదల



గద్వాలటౌన్ : ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించనున్న యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కోరారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, గోపాల్, కుమార్‌నాయుడు, చంద్రశేఖర్, చక్రధర్, ఎస్వీ రమణ, హుస్సేన్, బీసన్న, తిలక్, తిమ్మప్ప, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలు అనుమతులు తీసుకోవాలి



కేటీదొడ్డి: ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ అనుమతి గుర్తింపునకు ప్రతిపాదనలు పంపాంచాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేశారు. ప్రభుత్వం కేటాయించిన ఫీజులు మాత్రమే విద్యార్థుల నుంచి వసూలు చేయాలన్నారు. పాఠశాలలో కనీస వసతులు తప్పని సరిగా కల్పించాలన్నారు. డిసెంబర్ 30వ తేదీలోపు అనుమతులు తీసుకోవాలని అనంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి



గట్టులో మాట్లాడుతున్న తహసీల్దార్ సరితారాణి

గట్టు : బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని, బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ సరితారాణి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ, సంక్షేమంపై మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరితారాణి మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ బడికి పంపే విధంగా చైతన్యం చేయాలని సూచించారు. 14 ఏళ్లలోపు పిల్లల చేత పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ చెన్నయ్య మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ పిల్లలపై ఆధారపడి ఉందన్నారు. బాలలు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహా, సీడీపీఓ హేమలత, ఎంపీఓ రవికుమార్, నీతి అయోగ్ కోఆర్డినేటర్ అఫ్జల్, ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, ఏఎస్ఐ అయ్యన్న, ఏపీఎం సాంబశివుడు, సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ సాయికుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ కృష్ణమోహన్ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలల హక్కులపై అవగాహన ఉండాలన్నారు. పిల్లల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్యవివాహాలపై బాలల కమిటీ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ వెంకటేశ్వరి, బాలల సంరక్షణ అధికారి రవి, సూపర్‌వైజర్ సురేఖ, ఆర్ఐ దేవేందర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

మల్దకల్‌లో..

మల్దకల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్‌లో బాలల పరిరక్షణ కమిటీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జుబేర్ మొయినుద్దీన్, ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓ సుజాత, సూపర్‌వైజర్ నాగరాణి, శివయ్య ప్రకాష్, మహిళా సంఘాల సభ్యులు సుజాత పాల్గొన్నారు.



మల్దకల్‌లో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

ఎడ్ల బండ్ల గిరక పోటీలు ప్రారంభం

గట్టు : మండల పరిధిలోని బోయలగూడెం గ్రామంలో మంగళవారం ఎడ్ల బండ్ల గిరక పోటీలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు బల్గెర హనుమంతు, మాజీ జెడ్పీటీసీలు బాసు శ్యామల ప్రారంభించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా ఎండ్ల బండ్ల గిరక పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతునాయుడు, బాసు శ్యామలలు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. క్రీడా పోటీలను స్నేహ పూర్వక వాతావరణంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోనేష్, నూర్‌పాష, రాజునాయుడు, రామునాయుడు, వెంకటేష్, గోపాల్, తిమ్మప్ప, కృష్ణ, రామకృష్ణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు హనుమంతునాయుడు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఉండవెల్లి: బైక్ అదుపుతప్పి కిందపడి అదే సమయంలో ఆటో ఢీకొనడంతో మహిళకు గాయాలైన ఘటన పెద్ద పోతులపాడు స్టేజ్ సమీపంలో మంగళవారం జరిగింది. మానవపాడు మండలం చెన్నిపాడు గ్రామానికి చెందిన సుశీలమ్మ కంచుపాడు ఆలయానికి వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తున్న సమయంలో పెద్ద పోతులపాడు స్టేజ్ సమీపంలో బైక్ అదుపు తప్పి పడింది. ఈ నేపథ్యంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో కాలు విరిగినట్లు, 108 అంబులెన్స్‌లో కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓ భాస్కర్‌కు బీజేపీ మండలాధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో గత పది రోజుల నుంచి ప్రజలు తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మినారాయణ, మదన్ మోహన్, వెంకటేష్, మల్లికార్జున్, మహేష్, రాజు, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



కేటీదొడ్డి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి ఏజెన్సీకి పలు సూచనలు చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే త్వరితగతిన పూర్తిచేయాలి



పెద్దదిన్నెలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్



రామాపురంలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ

శాంతినగర్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రామకృష్ణ అధికారులకు సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల యాప్ సరిగా పనిచేయడం లేదని తెలిపారు. గంటల కొద్ది ఒకే చోట ఉండి దారుల వివరాలు సబ్‌మిట్ చేయాల్సి వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

అయిజ: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని కిష్టాపురం, వెంకటాపురం, యాపదిన్నె గ్రామాల్లో నిర్వహించిన సర్వేను ఎంపీడీఓ వెంకటయ్య పరిశీలించారు. ఈనెల 31నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పరిశీలన..

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, జల్లాపురం గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యదర్శులకు ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేలో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దదిన్నెలో కార్యదర్శులు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు దారుల వివరాలను పక్కాగా సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్‌రావు, కార్యదర్శి రాజశేఖర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



గద్వాలలో ముస్తాబయిన ఎంబీ మిస్పా చర్చి



అయిజలో వివిధ వేషధారణలో విద్యార్థులు



ఇటిక్యాలలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా పరిధిలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో పండగ వాతావరణం నెలకొంది. క్రిస్టియన్ యువజన సంఘాల సభ్యులు, ప్రైవేటు పాఠశాలల్లో క్రిస్మస్ సంబురాలు జరుపుకుంటున్నారు. చర్చిల ఆవరణలో ఏసుక్రీస్తు జననం, దేవుని జీవిత చరిత్ర, తదితర అంశాలను వివరిస్తున్నారు. మేరీ మాతా, శాంతాక్లాజ్ వేషధారణలతో అలరించారు. చర్చిలు విద్యుత్ కాంతుల వెలుగుల్లో ముస్తాబయ్యాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిల్లో అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం ముందస్తు వేడుకల్లో భాగంగా కేట్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హోసన్న మందిరాలు, బాపిస్టు చర్చిలను రంగు రంగుల కాంతులతో వెలిగిపోతున్నాయి. బుధవారం ప్రార్థనలకు చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఎర్రవల్లిలో క్రిస్మస్ వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు



విద్యుత్ కాంతుల మధ్య మెరిసిపోతున్న ధరూరు ఎంబీ చర్చి



అలంపూర్‌లో విద్యుత్ దీపాలతో సంతమార్కెట్ చర్చి

వసతులు కల్పించే వరకు పోరాటం

ఎర్రవల్లి: వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ధర్మవరం, వల్లూరు బాలుర వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో డార్మిటరీలతో పాటు వంట గదులు, స్టోర్ రూమ్‌లు తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీరు, ఫ్యాన్లు, కిటికీల వంటి సమస్యలతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మాధవ్, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పల్లయ్య

ధర్నాకు సంపూర్ణంగా మద్దతిస్తాం

అయిజ: జిల్లా కేంద్రంలో లాయర్లు నిర్వహిస్తున్న ధర్నాకు సంపూర్ణంగా మద్దతిస్తామని, ఒక రోజు దీక్షలో కూర్చొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అఖిలపక్షం కమిటీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని అఖిలపక్షం కమిటీ కార్యాలయంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని లాయర్లు పీజేపీ క్యాంప్ ఆవరణలోనే కోర్టు సముదాయాన్ని నిర్మించాలని దీక్షకు కూర్చున్నారని తెలిపారు. వారికి మద్దతుగా ప్రజా సంఘాలు, కుల సంఘాలు, రైతు సంఘాలతో కలిసి ఈనెల 27న దీక్షలో కూర్చొని లాయర్లకు సంపూర్ణంగా మద్దతిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం కమిటీ సభ్యులు మద్దిలేటి, నీలకంఠమయ్య, హనుమంతు, విజయభాస్కర్ రెడ్డి, వెంకట్రాములు, తాహేర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు నరసింహులు

డ్వాక్రా భవనాన్ని స్వాధీనం చేసుకోవాలి

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామంలో ప్రభుత్వ భవనాన్ని ప్రైవేట్ వ్యక్తి సొంత పనులకు ఉపయోగిస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకుని భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనగల గ్రామంలో 2008లో డ్వాక్రా భవనం నిర్మించారని, అనంతరం డీఆర్‌డీఏ శాఖ వారికి భవనాన్ని అప్పగించలేదన్నారు. భవనం నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామానికి చెందిన నాయకుడు వ్యవసాయ పనిముట్లు, ఇంటి అవసరాలకు భవనాన్ని వాడుకుంటున్నాడని అధికారులకు వివరించినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా ఎస్పీ, డీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.



తనగలలో ఆక్రమణకు గురైన డ్వాక్రా భవనం

రైతుల కష్టాన్ని గుర్తించాలి

అయిజ: రైతులు పడుతున్న కష్టాన్ని ప్రజలందరూ గుర్తించాలని ఓం శాంతి సభ్యురాలు మంజుల అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి అయిజ పట్టణంలో ఓం శాంతి సభ్యులు మంజుల, లక్ష్మి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. రైతులు ఏళ్ల తరబడి కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. రైతులకు అండగా నిలవాలన్నారు. అందరి ఆకలిని తీర్చుతున్న రైతులను దేవుళ్లుగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణంలోని మహిళలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.



ముసలి కన్నీరు కారుస్తున్నారు



అయిజ: కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ విషయంలో ముసలి కన్నీరు కారుస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ అతి తెలివితేటలు ప్రదర్శిస్తూ అనవసరంగా డాక్టర్ అంబేడ్కర్ పేరు వివాదంలోకి లాగారని ఆరోపించారు. అంబేడ్కర్‌కి పార్లమెంట్‌లో ప్రవేశం లేకుండా చేయడానికి 1952, 54లో అంబేడ్కర్‌ను ఓడించడానికి కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదని విమర్శించారు. కేవలం ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ పేరును ఉపయోగించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమసేనరావు, గోపాల కృష్ణ, భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు



శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ పైపాడు మిట్టలు ఆది నారాయణస్వామి వారి ఆశ్రమంలో వెలసిన ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈశ్వరీదేవి జీవసమాధి అయిన పవిత్ర దినం సందర్భంగా ఆలయ నిర్వాహకులు రవీంద్రాచారి ఆధ్వర్యంలో కళశ స్థాపన, పంచామృతాభిషేకం, ప్రభాతసేవ, శ్రీ గణపతి, వాస్తుపూజ, యాగమండపాల ప్రవేశం, చండీ హోమం సామూహికంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

అలంపూర్: పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన పి.జాన్‌కు రూ.60 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అలంపూర్ మండల అధ్యక్షుడు రాము, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బ్లూ కోర్టు పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని పంచలింగాలకు చెందిన శివ ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.